



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 171

పేజీలు : 6 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 18 నవంబరు 2023


# సింహం సింగిల్‌గానే వస్తుంది

● నేను ప్రజలను..దేవుడిని నమ్ముకున్నా ● ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి




**నూజివీడు,కలంకౌంటర్ :** దశాబ్ధాలుగా అనుభవదారులుగా రైతులకు హక్కులు కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పెత్తందార్లకు పేదలను పిలవడం నచ్చదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా భూ సర్వే చేస్తున్నామన్నారు. రెండు విడతల సర్వే పూర్తైందని, మూడో విడత ప్రారంభించబోతున్నామన్నారు. సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. 27లక్షల 42 వేల ఎకరాలకు సంబంధించి16 లక్షల 21వేల మందికి హక్కులు కల్పించ బోతున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో అసైన్డ్ భూములను అత్తగారి సొత్తులా భావించి స్వాధీనం చేసుకునేవారన్నారు. చుక్కల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చంద్రబాబు చేర్చారని జగన్ పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూములపై దళిత రైతుల రుణాలు మాఫీ చేస్తూ, సర్వ హక్కులు కల్పించబోతున్నామన్నారు. లంక భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మూడు కేటగిరీలుగా పట్టాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని జగన్ వెల్లడించారు.

**ప్రజలకు మంచి చేసి చంద్రబాబు ఎప్పుడూ సీఎం కాలేదు :** చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలను మోసం చేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బాబు సీఎంగా ఉన్నప్పుడు అంతా దోపిడినే జరిగిందని మండిపడ్డారు. ప్రజలకు మంచి చేసి చంద్రబాబు ఎప్పుడూ సీఎం కాలేదని అన్నారు. తొలిసారి వెన్నుపోటుతో, రెండోసారి కార్గిల్ యుద్ధం పుణ్యాన, మూడోసారి రుణమాఫీతో అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయన్న సీఎం జగన్ చంద్రబాబుకు మిగతా సామాజిక వర్గాలపై ఎలాంటి అభిప్రాయం ఉందో గుర్తు తెచ్చుకోవాలని ప్రజలకు సూచించారు. ఎస్సీల్లో ఎవరైరా పుట్టాలనుకుంటారా, బీసీల తోకలు కత్తిరిస్తానని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన మేనిఫస్టోలపై కమిట్‌మెంట్ లేని నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. ఎన్నికలు దగ్గరవుతున్న కొద్దీ తోడేళ్లంతా ఏకమవుతున్నారని సీఎం జగన్ మండిపడ్డారు. దొంగల ముఠా అంతా ఏకమై ప్రతి ఇంటికి బెంజ్ కారు ఇస్తమంటారు. నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. 2014 చంద్రబాబు, పవన్ ఏకమై ఇచ్చిన హామీలు నెరవేర్చారా అనే ఆలోచించాలని సూచించారు. తనకు ప్రజా దీవెనలు ఉన్నంత వరకు ఎవరితోనూ పొత్తు పెట్టుకోనని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 46,463.82 ఎకరాలను వ్యవసాయం కోసం కొత్తగా 42,307 మందికి డీకేటీ పట్టాలు పంపిణీ చేశారు. నిరుపేదలకు భూముల పంపిణీని

- 2లో







# దళితులను మోసం చేసిన పార్టీ వైసిపి



పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ : నియోజకవర్గం లో ప్రతి ఇంటికి తెలుగుదేశం పార్టీని చేరువ చేయడమే లక్ష్యంగా బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం - మీ మాట - నా బాట,భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం పిట్టలవాని పాలెం మండలం, మండేవారి పాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలసి ఆ గ్రామానికి వెళ్లి తెలుగుదేశం పార్టీ విధి విధానాలు వివరించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి ఇచ్చి, తన గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేసి ఆశీర్వదించమని కోరారు. అనంతరం భవిష్యత్ కు గ్యారంటీ పత్రాలలో వారి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి భవిష్యత్తు గ్యారెంటీ సంక్షేమ పథకాలు ఆయన ప్రజలకు వివరించారు. ముందుగా డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితులకు ఎంతో ఉపయోగపడే 28 పథకాలను జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేశారు అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో దళితులు ఇళ్ళు నిర్మించుకుంటామంటే రూ.2లక్షలు ఇచ్చిన ఘనత తమ పార్టీకే దక్కుతుంది అన్నారు. టీడీపీ హయాంలో దళితులకు కరెంటు ఉచితం గా ఉండేది అన్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నిసార్లు కరెంటు చార్జీలు పెంచారో ప్రజలందరికి అర్థం చేసుకోవాలి అన్నారు. తెలుగుదేశం పార్టీ విధివిధానాలు నచ్చి మండేవారిపాలెంకు చెందిన వైసీపీ పార్టీ నాయకులు వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరటం ఒక శుభపరిణామం అన్నారు.

# అన్నసమారాధన లో గోపు సత్యనారాయణ





మచిలీపట్నం,కలంకౌంటర్ : నాగుల చవితి సందర్భంగా కానూరు గ్రామంలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణా జిల్లా తెలుగురైతు అధ్యక్షులు గోపు సత్య నారాయణ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగేంద్ర స్వామి ప్రజలందరిని చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జనసేనతో కలిసే ఎన్నికలకు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



నెల్లూరు,కలంకౌంటర్ : ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసి కక్ష పూరిత రాజకీయాలతో కాలం గడుపుతోందని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తే ఇతర పార్టీలతో సంబంధాలు అంటగట్టడం దారుణమన్నారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్ని కార్యక్రమాలకు కేంద్రమే నిధులిస్తోంది. వైసీపీ ప్రభుత్వం సొంతంగా చేస్తున్న పని ఒక్కటీ లేదు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నించడం విపక్షాల హక్కు. రాష్ట్రంలో గతుకుల రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పనులు చేసిన గుత్తేదారులకు బిల్లులు ఇవ్వడం లేదు. రోడ్ల పరిస్థితిపై సోషల్ మీడియాలో జోకులు వస్తున్నాయి. రైతులను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసే వెళ్తాయి. ఏపీలో కుంభకోణాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పురందేశ్వరి అన్నారు.

**వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి వెళతాం** : ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన పనులన్నీ కేంద్రం నిధులతోనే అని స్పష్టం చేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడంలేదని ఆరోపించారు. రాష్ట్రంలో గతుకుల రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఏపీ రోడ్లపై సోషల్ మీడియాలో జోకులు వేసుకుంటున్నారని తెలిపారు. రైతులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పురందేశ్వరి ఆరోపించారు. రాష్ట్రంలో కక్షపూరిత, విధ్వంస రాజకీయాలు నడుస్తున్నాయని అన్నారు. ఏపీలో కుంభకోణాలపై కేంద్ర ప్రత్యేక దృష్టి పెట్టిందని వెల్లడించారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసే వెళతాయని పురందేశ్వరి స్పష్టం చేశారు.

# ధూళిపాళ్ల నరేంద్ర పై హత్యాయత్నం కేసు

గుంటూరు,కలంకౌంటర్ : పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పై హత్యాయత్నం కేసు నమోదైంది. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రంగాపురం వాసి ముసునూరి రాము ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 15వ తేదీన సంగం డెయిరీ వద్ద తమపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. పాల విక్రయానికి సంబంధించి బోనస్ 14 శాతం ఇవ్వలేదని రాము ఆందోళన వ్యక్తం చేశారు. డెయిరీ వద్దకు మాట్లాడదామని పిలిచి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో తమ మూడు కార్లు ధ్వంసం అయ్యాయని ఫిర్యాదు చేశారు. కర్రలు, హాకీ స్టిక్స్‌తో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాము ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ధూళిపాళ్ల నరేంద్రను 14 వ నిందితునిగా ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు.

# భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



కందుకూరు,కలంకౌంటర్ : నాగుల చవితి పర్వదినం సందర్భంగా కందుకూరు పట్టణంలో భక్తులు నాగల చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలో కనిగిరి రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో ఉన్న పుట్ట వద్ద వేకువజాము నుంచి మహిళా భక్తులు పుట్టలో పాలు పోసి నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్కందపురి శ్రీ సోమేశ్వర ఆలయం లో, కోవూరు రోడ్డు నందు ఉన్న, చుట్టుగుంట రోడ్డు నందు ఉన్న పుట్టల వద్ద మహిళా భక్తులు పుట్టలో పాలు పోసి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తీసుకుని వచ్చిన ప్రసాదాలను పంపిణీ చేశారు.

# సమాజ భాగస్వామ్యంతోనే బాల్యవివాహాలు అంతం - ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల,కలంకౌంటర్ : బాల్యవివాహాలు సామాజిక సమస్య అని సామాజిక భాగస్వామ్యంతోనే ఈ సమస్యకు అంతమని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రచురించిన బాల్యంలో పెళ్లిళ్లు - భావితరాలకు ఉరితాళ్లు అనే కరపత్రాన్ని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజంలోని దురాచారానికి ప్రతిరూపమని బాల బాలికలను చదువు ఆటపాటలకు దూరం చేసి కష్టాలలోకి నడుతుందని, పసి వయస్సు పిల్లలను భవిష్యత్తును దూరం చేస్తుందని అన్నారు. బాల్య వివాహాలు చేసుకున్న వారు సామాజికంగా, ఆరోగ్యం పరంగా, కుటుంబ పరమైన సమస్యలను ఎదుర్కొంటారని అన్నారు. బాల్య వివాహాలను అంతమందించేందుకు బలమైన చట్టాలు ఉన్నాయని ఈ నేరానికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానాతోబాటు నిందితునికి బెయిల్ కూడా ఉండదని తెలిపారు. బాల్య వివాహాలు జరిపిన పక్షంలో ఇరుపక్షాల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పెళ్లి చేసిన పురోహితులు పెళ్లిలో పాల్గొన్న పెద్దలు తదితరులు శిక్షకు అర్హులవుతారని అన్నారు. మీ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతూ ఉంటే సమీపంలోని పోలీస్ స్టేషన్, అంగన్వాడీ కేంద్రం, స్కూల్ టీచర్, గ్రామ సచివాలయము సిబ్బందికి తెలియచేయాలని లేదా 100, 1098 నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. ఇలాంటి మంచి కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న డిబిఆర్సి బృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డి.బి.ఆర్.సి ఏరియా కో-ఆర్డినేటర్ వి భగవాన్ దాస్ మాట్లాడుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ దళితులు, గిరిజనులు పేద ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలలో వారికి సమాజం పట్ల ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వీరిలో బాల్యవివాహాలు అధికంగా ఉన్నాయని వారికి అవగాహన కల్పించేందుకు బాపట్ల చీరాల వేటపాలెం మండలాలలో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పించి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వారితో ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుదే రాజారావు, శాంతి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వాహకులు కనపర్తి రాజారావు పాల్గొన్నారు.

# మెరుగైనవైద్యసేవలు అందించాలి

● డిఎం అండ్ హెచ్ ఓ



బంటుమిల్లి,కలంకౌంటర్ : ప్రస్తుతం అందిస్తున్న వైద్యశాల కన్నా మరింత మెరుగైన వైద్య సేవలను రోగులకు అందించాలని కృష్ణాజిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని డాక్టర్ గీతా భాయ్ అన్నారు. శుక్రవారం బంటుమిల్లిలో జరిగిన జగనన్నకు శబ్దం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా బంటుమిల్లి పిహెచ్సి ని ఆమె సందర్శించారు పిహెచ్సిలో అందిస్తున్న సేవలను వైద్యుల సిబ్బంది పనితీరును ఈ సందర్భంగా ఆమె సమీక్షించారు. అందిస్తున్న వైద్య సేవలు పట్ల మీ సంతృప్తి వ్యక్తం చేస్తూ మరింతగా వైద్యశాల అందించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్, వైద్య సిబ్బంది ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ అంకమ్మ తల్లికి వైభవంగా అభిషేకం పల్లకి సేవ



కందుకూరు,కలంకౌంటర్ : కందుకూరు గ్రామదేవత, ఆదిపరాశక్తి శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి శుక్రవారం శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం అమ్మవారిని కన్నుల పండుగ అలంకరించారు. గాయత్రి విద్యాసంస్థల అధినేత రామకృష్ణ కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు.సాయంత్రం అమ్మవారికి వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు.శ్రీ నటరాజనాట్యమండలి సరస్వతి నిలయం వారిచే పల్లకి సేవలో కోలాటం నిర్వహించారు.పల్లకి సేవ నేత్రపర్వంగా సాగింది. చిన్నారుల కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి అలంకారం భక్తులను పారవస్యం చేసింది.మహిళా భక్తులు లలిత సహస్రనామ పారాయణం ఆలపించారు. వందల సంఖ్యలో అయ్యప్ప స్వాములు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ పోలేరమ్మ దేవస్థానం వద్ద ప్రతి శుక్రవారం అన్నప్రసాద వినియోగం - ధర్మకర్త సాధు మాధవరావు



కందుకూరు,కలంకౌంటర్ : పట్టణంలోని చుట్టుగుంట రోడ్డు శ్రీరామ్ కాలనీ వద్ద వెలసి ఉన్న శ్రీ పోలేరమ్మ దేవస్థానం వద్ద ప్రతి శుక్రవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని శ్రీ పోలేరమ్మ దేవస్థానం ధర్మకర్త సాధు మాధవరావు తెలిపారు. మహిమలు కలిగిన పోలేరమ్మ దేవతను పూజించుకునేవారు భక్తులు ప్రతి ఒక్కరు దేవస్థానం వద్దకు వచ్చి అమ్మ వారి కరుణాకటాక్షం పొందగలరని ఆయన తెలిపారు. దేవస్థానంలో ప్రతి శుక్రవారం భజన కార్యక్రమాలతో పాటు, అన్నదాన కార్యక్రమం జరుగుతూ ఉంటాయని భక్తులు ఆయా కార్యక్రమంలో పాల్గొనదలచినవారు నేరుగా దేవస్థానం వద్దకు వచ్చి పాల్గొనాలని కోరారు. ప్రతి శుక్రవారం జరిగే అన్నదాన కార్యక్రమానికి ఎవరైనా విరాళాలు ఇవ్వదలచిన వారు నేరుగా దేవస్థానం వద్దకు వచ్చి వారిని సంప్రదించాలని ఆయన తెలిపారు. అమ్మవారు వెలసిన నాటినుండి అనేకమంది భక్తుల కోరికలను నెరవేర్చిన పోలేరమ్మ తల్లిని ప్రతి ఒక్కరు దర్శించుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి వారి కోరికలను అమ్మవారి ద్వారా నెరవేర్చుకావాలని ఆయన భక్తులను కోరారు.

# టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన





కందుకూరు,కలంకౌంటర్ : టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కందుకూరు కు చెందిన వృక్ష శాస్త్ర,జంతు శాస్త్ర విద్యార్థినీ విద్యార్థులు శుక్రవారం వెంకటాద్రిపాలెంలోని జిల్లెల మూడి వెంకటే శ్వర్లు కు చెందిన ఆర్గానిక్ ఫార్మింగ్ పంట పొలాలకు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. ఐదు ఎకరాల్లో రసాయనాల వాడకం లేకుండా ఆర్గానిక్ పద్ధతిలో సాగు అవుతున్న 15 రకాల కూరగాయల పెంపకాన్ని పరిశీలించారు. అనేక మెలకువల్ని వెంకటేశ్వర్లు ద్వారా తెలుసుకున్నారు. అదే క్షేత్రంలో ప్రారంభించబడిన తేనెటీగల పెంపకం గురించి కూడా విద్యార్థిని విద్యార్థులు వెంకటేశ్వర్లు ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సాగు విధానం 365 రోజులు ఆదాయం ఇచ్చే విధంగా కొనసాగుతుందని ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. కళాశాలలో ఆర్గానిక్ ఫామింగ్ ను ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో గత రెండు సంవత్సరాలుగా విద్యార్థులచే ప్రాక్టీస్ చేయిస్తున్నామని కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకులు, డాక్టర్ ఎన్. తిరుపతి స్వామి, బాలు నాయక్ తెలిపారు. ఇటువంటి క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కలుగుతుందని తెలిపారు. జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఐ. అనూష, డి. ఇంద్రజ మరియు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తిరువూరు లో నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు దేవాలయాల్లో నాగేంద్ర స్వామి పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

-తిరువూరు,కలంకౌంటర్ :




## కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుంది

- భట్టి విక్రమార్కను అత్యధిక మెజార్టీతో గెలిపించండి
- భట్టి తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య



**మధిర, కలంకౌంటర్ :** మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో మల్లు భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ హస్తం గుర్తుకు ఓటేసి మల్లు భట్టి విక్రమార్కను అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే గా గెలిపించాలని,మధిర ను మరింత అభివృద్ధి చేసి చూపిస్తారని ప్రజలను ఓటు అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని ప్రభుత్వం వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ముఖ్య కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,అభిమానులు పాల్గొన్నారు.

## నెల్లూరు వెళ్లిన బిజెపి శ్రేణులు



**కందుకూరు,కలంకౌంటర్ :** నెల్లూరులో శక్తి కేంద్ర ప్రముఖులు, పోలింగ్ బూతు అధ్యక్షులు సమావేశము శుక్రవారం జరిగింది. ఈ సమావేసానికి ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె నాయకులకు ,కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. కందుకూరు నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి , బిజెపి రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ ఉన్నం నళిని దేవి ఆధ్వరం లో బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు నెల్లూరు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులుజోన్నదుల రాఘవులు, జి మోజేష్, చల్లా రాజా, ప్రసాదు, వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.















Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com